మౌలిక సదుపాయాల కల్పనకు.. తొలి ప్రాధాన్యం



» 15 నెలల కాలంలో రూ.40 కోట్లతో నగరాభివృద్ధి
» విలీన పంచాయతీలను కలుపుతూ రూ.350 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు : మేయర్ షేక్ నూర్జహాన్

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

'నగరం, విలీన పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. 84 కాలనీల్లో రూ.100 నుంచి రూ.200 కోట్ల వరకు స్టామ్‌వాటర్ డ్రెయిన్ల అభివృద్ధికి ప్రతిపాదించాం. పోణంగిలో 100 ఎకరాల్లో తాగునీటి కోసం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి రూ.75 కోట్లతో చర్యలు చేపడుతున్నాం. దెందులూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల చుట్టూ రివిట్‌మెంట్ వాల్ పటిష్టానికి రూ.5కోట్లతో ప్రభుత్వానికి నివేదించాం. ఇప్పటికే ప్రతీ కుటుంబానికి రెండు పూటలా రెండు గంటల చొప్పున తాగునీరు అందిస్తున్నాం. ఉదయం పూట పారిశుధ్యం, ఇతర సమస్యలపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాం.

- షేక్ నూర్జహాన్, ఏలూరు నగర మేయర్

ఏలూరు/ఏలూరు టూ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలోని సమస్యల పరిష్కారం కోసం మేయర్ షేక్ నూర్జహాన్‌తో 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించింది. ప్రజల సమస్యలను సావధానంగా విన్న మేయర్ అన్ని సమస్యలను అధికారులను పంపి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా నగరంలో కుక్కలు, పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నట్టు ఫిర్యాదులొచ్చాయి. వర్షాలకు రోడ్లలో చాలా వరకు మునిగిపోవడంతో రోడ్లు వేయాలన్న డిమాండ్లు అధికంగా వచ్చాయి. విలీన గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడం, వర్షపునీరు నిలవడం వాటిల్లో పందులు, కుక్కలు సంచారం చేయడం తద్వారా దోమలు ప్రబలి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నట్టు సమస్యలు వెల్లువెత్తాయి. విలీన గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రస్తావించారు. సమస్యలన్నింటిపై పరిశీలించి త్వరలో పరిష్కారం చూపిస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

పారిశుధ్యం.. పందుల బెడద

- లక్ష్మీనగర్ ఖాళీస్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. వాటిల్లో పందులు దొర్లుతూ పరిసరాలను అధ్వానం చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ స్థలాల్లో వర్షపునీరు నిల్వ ఉండి దోమల ఉధృతి పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.
  - గాబ్రియేల్, రిటైర్డు ఎంఈవో, లక్ష్మీనగర్
- వెంకటాపురం సమీపంలోని సుంకరవారితోటలో దోమల బెడద ఎక్కువగా ఉంది. మా అపార్టుమెంట్ చుట్టూ ఖాళీ స్థలాలు ఉన్నాయి. వర్షపునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతున్నాయి.
  - ఉదయ్ భాస్కర్, సుంకరివారితోట

వెంటాడుతున్న కుక్కల భయం

- శ్రీరామ్‌నగర్‌లో ఒకటో రోడ్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రజలు, స్కూల్ వెళ్లే పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కుక్కల బెడదను నివారించండి.
  - బెనర్జీ, శ్రీరామనగర్
- మంచినీళ్ల తోటలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. వాహనాల వెంట పరిగెత్తుకుని వస్తున్నాయి. చిన్న పిల్లలు సైకిళ్ల వెంట పరుగులు పెట్టడంతో బెంబేలెత్తిపోతున్నారు.
  - మురళీమోహన్, చాణక్యపురి కాలనీ

మేయర్ : నగరంలో కుక్కల సంచారం ఉన్న వాట వాస్తవమే. అయితే చాలా మంది ఇళ్ల బయట ఆహార పదార్థాలను పడవేయడం వల్ల కుక్కలు సంచరిస్తున్నాయి. అన్నం, ఇతర పదార్థాలు బయట పడవేయకుండా, చెత్త బళ్లకు అందివ్వాలి. కుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేస్తున్నాం.

'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమానికి వెల్లువెత్తిన సమస్యలు

- శనివారపుపేట దొండపాడు ఎంపీపీ పాఠశాల చుట్టు మురుగునీరు నిలిచిపోతోంది. పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. చుట్టు పక్కలా నడవడానికి దారి లేకుండా ఉంది.
  - రాజనాల రామచంద్ర, దొండపాడు
- దొండపాడులో చెత్తను అంతా తీసుకెళ్లి మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, తమ్మిలేరులో పడవేస్తున్నారు. చుట్టుపక్కల వారికి దుర్వాసన వస్తోంది. ఇళ్లను కూల్చినప్పుడు మెటీరీయల్‌ను తమ్మిలేరులో వేస్తున్నారు. దీంతో రహదారి మూసుకుపోయింది.
  - రాజ సులోచన, దొండపాడు

మేయర్ : ఖాళీ స్థలాలు పిచ్చిమొక్కలు తొలగించుకోవాలని నోటీసులు జారీ చేస్తాం. ఇప్పటికే ఖాళీ స్థలాలను మెరక చేసుకోవాలని యజమానులకు అవగాహన పరుస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాం. పందుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం. దొండపాడు ఎంపీపీ పాఠశాల చుట్టూ నీటిని తొలగిస్తాం. తమ్మిలేరులో వ్యర్థాలు, చెత్తను పడవేయకుండా చర్యలు తీసుకుంటాం.

విలీన గ్రామాల్లో సౌకర్యాలు కల్పించండి..

- బూరాయిగూడెం శ్మశానవాటిక అధ్వానంగా తయారైంది. ముళ్లపొదలు, చెట్లు ఏపుగా పెరిగాయి. వర్షం వచ్చినప్పుడు మృతదేహాలను తీసుకెళ్లేటప్పుడు ప్రజలు జారి పడిపోతున్నారు. మౌలిక సదుపాయాలను కల్పించండి.
  - బుద్దుల వేణుగోపాల్, బూరాయగూడెం.

మేయర్ : ప్రభుత్వం నుంచి నిధులు రాగానే శ్మశాన వాటికను బాగు చేయిస్తాం. రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పను నిధులు రావాల్సి ఉంది.

- మాదేపల్లి, సుంకరివారితోట, తంగెళ్లమూడి ప్రాంతాల్లో సుద్దనీరు వస్తోంది. ఈ నీరు తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. గోదావరి కాల్వ నీరు ఇప్పించండి.
  - కిశోర్, సుంకరవారి తోట

మేయర్ : విలీన గ్రామాల్లో కృష్ణా, గోదావరి కాల్వల నుంచి తాగునీటిని అందరికి సరఫరా చేయడానికి రూ.143 కోట్ల వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

రోడ్లు అధ్వానం

- శనివారపుపేట సెంట్‌ఆన్స్ కళాశాల ఎదురుగా రోడ్డును తవ్వి వదిలేశారు. నూతన రోడ్డును నిర్మించలేదు. విద్యార్థులు, స్థానికులు

(మిగతా 10వ పేజీలో)

- తంగెళ్లమూడి లక్ష్మీనగర్‌లో ఐదో రోడ్డు గోతులతో అధ్వానంగా ఉంది. వర్షం వస్తే మోకాలి లోతు నీరు నిలిచిపోతోంది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
  - రవికుమార్, లక్ష్మీనగర్
- నగరంలో ఎన్‌ఆర్‌పేట, జూట్‌మిల్లు రామకృష్ణాపురం పరిసరాల్లో ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జిల కింద అప్రోచ్ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పారిశుధ్య పరిస్థితులు మెరుగుపర్చాలి.
  - శర్మ, రేట్ పేయర్స్ నగర అధ్యక్షుడు

మేయర్ : నగరంలో రోడ్లను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే నగరంలో ఏడాదిన్నర కాలంలో రూ.40 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేశాం. అధికారులు అక్కడ రోడ్డు పరిశీలించి ప్రతిపాదనలు తయారు చేస్తారు. అప్రోచ్ రోడ్లు అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేస్తాం. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉంటే వారికి నివేదిస్తాం.

- నగరంలో విజయ గార్డెన్స్‌లో ఆక్రమణలను ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌లో క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం అధికంగా ఫీజులు వసూలు చేస్తోంది. ఫీజులు తగ్గించే ఏర్పాట్లు చేయండి.
  - నరసింహారావు, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ

మేయర్ : ఫీజులు తగ్గించే విషయం మా పరిధిలో లేదు. మీ సమస్యను ప్రభుత్వానికి నివేదిస్తాం.

జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్‌బాషాకు జేడీగా పదోన్నతి



ఏలూరుసిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖాధికారిగా పనిచేస్తున్న షేక్ హబీబ్‌బాషాకు పదోన్నతి లభించింది. ఇప్పటివరకు డీడీ క్యాడర్‌లో పనిచేస్తున్న హబీబ్ బాషాను నెల్లూరు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ పోస్టింగ్ ఆర్డరు ఇచ్చారు. అయితే రైతులకు అందిస్తున్న సేవలకు అనుగుణంగా జేడీగా పదోన్నతి లభించినా ఆయనను ఏలూరు జిల్లా వ్యవసాయశాఖాధికారిగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయనకు ఇచ్చిన పదోన్నతి ఆర్డరులోనే ఈ అంశాన్ని పొందుపచారు. 2024, ఫిబ్రవరి 26న ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖాధికారిగా హబీబ్‌బాషా బాధ్యతలు స్వీకరించారు.

చురుగ్గా ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలు



ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను చురుకుగా అమలు చేయాలని ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ సాక్స్) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై.కామేశ్వరప్రసాద్ సూచించారు. జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని ఏఆర్టీ సెంటర్, ఐసీటీసీ ల్యాబ్‌లను శుక్రవారం సందర్శించిన ఆయన కేంద్రంలో ఎయిడ్స్ రోగులకు అందుతున్న వైద్యసేవలు, ల్యాబ్ టెస్టుల గురించి ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతంను కలిసి జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై చర్చించారు.



ట్రాఫిక్ రూల్స్ పాటించండి : ఎస్పీ

ఏలూరు టూటౌన్,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరాలని ఎస్పీ కేపీఎస్.కిశోర్ సూచించారు. ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశ్రం ఆధ్వర్యంలో రోడ్డు సెఫ్టీ అవగాహన ర్యాలీ జరిగింది. ఆసుపత్రి నుంచి కలపర్రు టోల్‌గేట్ మీదుగా హనుమాన్ జంక్షన్ వరకు, అక్కడ నుంచి మరలా ర్యాలీగా వెనక్కి వచ్చారు. ఆశ్రం సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు, ఆశ్రం ఆటోడ్రైవర్లు, డాక్టర్లు సుమారు 200 మందికి పైగా ర్యాలీలో పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ నిర్లక్ష్య ధోరణి ప్రమాదాలకు కారణమన్నారు. ఆశ్రం సీఈవో డాక్టర్ కె.హనుమంతరావు మాట్లాడుతూ ఎస్పీ సూచన మేరకు రాపిడ్ ట్రామా టీమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ర్యాలీలో ఆశ్రం ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ ప్రణయ్, ఆశ్రం సీఈవో రాజరాజన్, సూపరింటెండెండ్ డాక్టర్ కె.శాంతయ్య, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెండ్ డాక్టర్ హరీశ్ గౌతమ్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : పీడీఎస్‌వో

ఏలూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలనీ, జిల్లాలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌వో), నవయువ సమాఖ్య జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ మాట్లాడుతూ పది ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిన లీజుకి ఇచ్చే నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలన్నారు. పీడీఎస్‌వో రాష్ట్ర కోశాధికారి ఎస్.భాను మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.12.6 కోట్లు కేటాయించి పక్కా భవనాలను నిర్మించాలన్నారు.



భక్తవత్సల..గోవిందా..

ఆత్రేయపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ పుష్పాలతో అలంకరించారు. శోభాయాత్రగా గౌతమి గోదావరి వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. గోదావరి జలాలను తీసుకువచ్చి మహాస్నపనం నిర్వహించారు. లక్ష కుంకుమార్చన, ప్రధాన హోమాలు చేశారు. శ్రీవారు ఉభయ దేవేరులతో కల్పవృక్షవాహనంపై విహరించారు. చూర్ణోత్సవం నిర్వహించారు. రాత్రి కల్కి అలంకరణలో అశ్వవాహనంపై విహరించారు.

ఐవీఆర్‌ఎస్ ప్రయోగం ఫలించేనా?

» జిల్లా టీడీపీ అధ్యక్ష పదవికి రెండో దఫా సర్వే
» చంటి, గన్నిలపై ఆరా.. పార్టీ తీరుపై ఆశావహుల ఆగ్రహం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)
టీడీపీ జిల్లా అధ్యక్ష పదవికి రెండో దఫాగా ఐవీఆర్‌ఎస్ సర్వేకు టీడీపీ అధిష్టానం దిగడంతో పార్టీ శ్రేణుల్లో గందరగోళానికి దారితీసింది. మూడు నెలల నుంచి అధ్యక్ష పదవిపై ఎడతెగని సందిగ్ధత నెలకొంది. దరఖాస్తు చేసిన వారిలో ఐదుగురితో షార్ట్ లిస్టు రూపొందించినా.. ఈ విషయాన్ని తేల్చకుండా మరో దఫాలో ఇద్దరి పేర్లతో ఐవీఆర్‌ఎస్ ప్రయోగం ఏమిటనే వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. జిల్లాలో గన్ని వీరాంజనేయులు, ఘంటా మురళి, పెనుమర్తి రామ్‌కుమార్, బడేటి చంటి, శ్యామ్‌చంద్రశేషు ఈ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఐవీఆర్‌ఎస్ సర్వేలో కొంత మందిని పరిగణనలోకి తీసుకోకుండా తెరపైకి మొదటి పేరుగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, రెండో పేరుగా ప్రస్తుత అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పేర్లతో రెండో దఫాగా శుక్రవారం చేపట్టడం పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. ఒక దఫాగా మొదటి పేరుగా గన్ని వీరాంజనేయులు, రెండో పేరుగా కైకలూరు టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పేర్లను చేర్చి ఐవీఆర్‌ఎస్ సర్వేను చేపట్టారు. టీడీపీ అధ్యక్ష పదవి రేసుపై పార్టీ అధిష్ఠానం రెండో దఫా ఐవీఆర్‌ఎస్ సర్వే చేయడంతో ఇక మూడు దఫా ఉంటుందా? అందులో తమను చేరుస్తారా ? అంటూ ఆశావహులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఏకాభిప్రాయ సాధన చేయకుండా ఐవీఆర్‌ఎస్ సర్వేలో తమను ఎందుకు విస్మరించారంటూ పలువురు మండిపడుతున్నారు. దీనిపై పార్టీ అధిష్ఠానం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

జీతాలకు ఇబ్బంది లేదు..!

» పీహెచ్‌సీ వైద్య సిబ్బంది జీతభత్యాల చెల్లింపునకు ప్రత్యామ్నాయ చర్యలు
» సమ్మెలో వున్న వైద్యుల డీడీవో అధికారాల బదలాయింపు

ఏలూరు అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):పీహెచ్‌సీ వైద్యుల సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యసిబ్బందికి అక్టోబరు జీతభత్యాల చెల్లింపునకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం పూర్తి చేశారు. సిబ్బంది జీతాల బిల్లులకు డీడీవోలుగా పీహెచ్‌సీ వైద్యులే ఉంటారు. గతనెల 30 నుంచి వారు సమ్మెలో వున్నందున సిబ్బందికి అక్టోబరు జీతభత్యాల బిల్లులు తయారు చేయడానికి సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని 62 పీహెచ్‌సీల సిబ్బందికి ఈనెల జీతభత్యాల బిల్లులు తయారు చేయడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టారు. ఏజెన్సీలోని 15 పీహెచ్‌సీల వైద్య సిబ్బందికి జీతం బిల్లులను పీఆర్ గూడెం, వేలేరుపాడు పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు తయారుచేసి సంబంధిత సబ్‌ట్రెజరీ కార్యాలయాలకు సమర్పించేలా డీడీవో అధికారాలను తాత్కాలికంగా అప్పగించారు. జిల్లాలోని మిగతా పీహెచ్‌సీల సిబ్బంది జీతాల బిల్లులను డీఐవో డాక్టర్ శోభ, డీపీఎంవో డాక్టర్ బాలప్రకాశ్‌లకు డీడీవో అధికారాలను అప్పగించారు. దీనిపై డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం శుక్రవారం రాత్రి వివరణ ఇస్తూ అక్టోబరు జీతభత్యాల గురించి వైద్యసిబ్బంది ఆందోళన చెందవద్దని, ఈనెల 20 వరకు బిల్లులను ఖజానా కార్యాలయంలో సమర్పించేందుకు వెసులుబాటు ఉన్నందున, ముందుగానే సమ్మెలో వున్న మెడికల్ ఆఫీసర్ల నుంచి డీడీవో అధికారాలను వేరొకరికి అప్పగించామన్నారు.

సమ్మెలో వున్న వైద్యులకు మరోసారి హెచ్చరిక

పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ కోటాను 30 శాతంగా నిర్ధారించి వరుసగా ఐదేళ్లపాటు అన్ని క్లినికల్ బ్రాంచ్‌ల్లో అమలుచేయాలనే ప్రధాన డిమాండ్‌తో 18 రోజులుగా పీహెచ్‌సీ వైద్యులు సమ్మె చేస్తున్న విషయం విదితమే. జిల్లాలో మొత్తం 124 మంది వైద్యులకు 11 వెకెన్సీలున్నాయి. సెలవులపై వున్న వైద్యులను మినహాయిస్తే సమ్మెలో 87 మంది పాల్గొంటు న్నారు. వీరందరికీ తక్షణమే విధుల్లో చేరాలని వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తాజాగా మరో దఫా సూచించారు. సమ్మెలో కొనసాగితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటామని హెచ్చరించారు.

పీహెచ్‌సీలకు వైద్యుల సర్దుబాటు

డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం

అర్బన్ పీహెచ్‌సీలు, అదనపు వైద్యులు, ఎన్‌హెచ్‌ఎం మెడికల్ ఆఫీసర్లను డిప్యూటేషన్లపై పీహెచ్‌సీలకు నియమించామని, ఇంతవరకు ఎక్కడా కొరత లేకుండా వైద్యులను సర్దుబాటు చేస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం తెలిపారు. మరోవైపు సమ్మెలో కొనసాగుతున్న ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గంగాభవాని, డాక్టర్ జోషిమా మాట్లాడుతూ తమ డిమాండ్లపై శుక్రవారం సాయంత్రం చర్చల నిమిత్తం సచివాలయానికి రావాలని ప్రభుత్వం సంఘ రాష్ట్ర నాయకులను ఆహ్వానించిందని, సానుకూల నిర్ణయం వెలువడుతుందని ఆశిస్తున్నామన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

ఏలూరు క్రైం,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ఈనెల 18న తేదీ నుంచి 21వ తేదీ వరకు 1800 2331077 టోల్ ఫ్రీ నెంబర్‌తో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని, ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే సహాయం కోసం ఫోన్ చేస్తే సహాయ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నవ సమాజానికి బాలికలు స్ఫూర్తిదాయకులు

» కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):నవ సమాజానికి బాలికలు స్ఫూర్తిదాయకులుగా నిలవాలని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఆడిటోరియంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకుని జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ల వినియోగం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన 14 మంది బాలికలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను బహుకరించారు. డ్రాపవుట్ హిమ బిందు తిరిగి బడిలో చేరగా కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ ఆమెను సన్మానించారు. ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఐసీడీఎస్ ఆర్జేడీ సుజాతా రాణి, పీడీ శారద, డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం, డీఈవో వెంకట లక్ష్మమ్మ, డీసీపీవో సూర్య చక్రవేణి, డీఆర్డీఏ పీడీ విజయరాజు, తహసీల్దార్ గాయత్రీదేవి, ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పరిశుభ్రత జిల్లాగా తీర్చిదిద్దాలి..

ఏలూరు సిటీ : పరిశుభ్రత జిల్లాగా తీర్చిదిద్దడానికి అధికారులు మనసుపెట్టి పనిచేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నగరపాలక సంస్థ, మునిసి పాలిటీలు, పంచాయతీల్లోని శానిటేషన్‌పై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. మండలాల వారీగా శానిటేషన్ ప్రగతిని సమీక్షిస్తూ లోటు ఉన్న మండలాల అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో శానిటేషన్ మెరుగుపరచకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్లాప్ మిత్రలను అవసరమైన చోట తాత్కాలికంగా నియమించుకోవాలన్నారు. డీపీవో అనూరాధ, జడ్పీ సీఈవో శ్రీహరి, నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ జి.త్రినాథ్‌బాబు, డ్వామా పీడీ వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో యువకుడికి ఏడేళ్ల జైలు

బాణసంచా అక్రమ తయారీ కేంద్రంపై దాడి.. ఇద్దరి అరెస్టు

మరిగే సాంబారులో పడి వ్యక్తి మృతి

లోపలి పేజీలో..



యువజనోత్సవంలో ఆకట్టుకున్న విద్యార్థినుల పల్లె నృత్యం

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

యువజనోత్సవాల ప్రారంభ సభలో ఎమ్మెల్యే ఆరిమిల్లి

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



యువజనోత్సవాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ నేటి యువత చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. పోటీలు విద్యార్థులలో శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పాటునిస్తాయని వివరించారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో నూతన పరిశ్రమలు, టెక్నాలజీని అభివృద్ధి చేసే ఐటీ పరిశ్రమలు పెట్టుబడులు పెడుతున్నారని, దీని ద్వారా యువతకు రానున్న ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారని వివరించారు. ఇపుడు గుగూల్ డేటా సెంటర్ కూడా వైజాగ్ రావడంలో సీఎం చంద్రబాబు కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. సెట్‌వెల్ ముఖ్యకార్యనిర్వహణాధికారి కేఎస్.ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు అందించే అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. జీవితంలో కెరీర్ పరంగా ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు. పోటీలలో తణుకు, తాడేపల్లిగూడెం, గణపవరం, పాలకొల్లు, భీమవరం, నరసాపురం నుంచి వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ చిట్టూరి సత్య ఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, ప్రిన్సిపాల్ యు. లక్ష్మీసుందరీబాయి, వావిలాల సరళాదేవి, కొండేటి శివ, కొమ్మిరెడ్డి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

దీపావళి దివ్వెలు

మార్కెట్‌లో అందమైన ప్రమిదలు.. ధర ఎక్కువే!















ఏలూరు సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి అంటేనే దీపాల వెలుగులు. దీపావళి అమావాస్య వేళ రాత్రి సమయంలో దీపాలను వెలిగించి, బాణసంచా కాలుస్తారు. వెలుగులు చిందే దీపం కూడా అందంగా తీర్చిదిద్ది మార్కెట్‌లో అమ్మకానికి ఉంచారు. వివిధ రంగులలో ఆకారాలలో విశేషంగా ఆకర్షిస్తున్నాయి. దీపావళి పండుగ రోజు అలంకరణ, వెలుగులు చిందే దీపాలకు ప్రత్యేక ప్రాశస్త్యం కూడా ఉంది. ప్రమిద వెలుగు నవగ్రహ దోషాలను పోగొడుతుందని పంచాంగకర్తలు చెబుతారు. దీపావళి వస్తోందంటేనే ప్రమిదలకు ఏటా గిరాకీ పెరుగుతుంది.

ప్రమిదలు.. రంగుల కుండలు

ప్రస్తుతం మార్కెట్‌లో ప్రమిదల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ ఆకృతుల లో మట్టి ప్రమిదలు రంగులతో పాటు చిన్నపిల్లలు దీపావళి పూజకు వినియోగించే చిన్ని చిన్ని కుండలను రంగులతో తీర్చిదిద్ది విక్రయిస్తున్నారు. వివిధ రకాల ఆకృతులతో దీపాలు వెలిగించే వివిధ రకాల దేవుళ్ల ఆకృతులను కూడా తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు.

దుకాణాల వద్ద సందడే సందడి

ప్రమిదల దుకాణాలు సందడిగా ఉన్నాయి. ఏలూరుతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రమిదల వ్యాపారం జోరుగా సాగుతోంది. గత ఏడాదితో పోలిస్తే ధరలు విపరీతంగా పెరిగాయని చెబుతున్నారు. డజను రూ.30 నుంచి రూ.120 వరకు, వివిధ ఆకృతులలో ప్రత్యేక దీపాలు రూ.వెయ్యి ధరకు విక్రయిస్తున్నారు. గంటలు ఆకృతులలో ప్రమిదలు, వివిధ రకాల బొమ్మలు, గుడి ఆకారంలో ప్రమిదలు, వినాయక మండ పాలు, నెమలి సింహాసనం, తామరాకు, పద్మం, శివాకారం, లాంతరు ఆకారంలో ప్రమిదలు, పద్మంలో కుండను పెట్టి చుట్టూ దీపాలు పెట్టుకునే విధంగా ఏర్పాటు చేసిన ప్రమిదలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఆకాశ దీపాలు రూ.150 నుంచి రూ.600 ధరకు అమ్మకాలు చేస్తున్నారు. రంగు ల కుండ ఒక్కొక్కటి రూ.30, బొమ్మలు ధర రూ. 150 నుంచి రూ. 3 వేలకు విక్రయిస్తున్నారు.

బాణసంచా.. జాగ్రత్తలు



పోలవరం అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళికి కొత్తబట్టలు, నోరూరించే పిండి వంటలు, లక్ష్మీదేవి పూజ ఒక ఎత్తు.. టపాసుల మోత మరో ఎత్తు. బాణసంచా సరదా నింపాలంటే జాగ్రత్తగా ఉండాలి. టపాసులు కాల్చే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవడం తప్పని సరి.

- టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులను ధరించడం మంచిది.
- చేతులు, ముఖాన్ని కాలుతున్న టపాసులకు దూరంగా ఉంచి జాగ్రత్తగా అంటించాలి.
- చిన్నారులు టపాసులు కాల్చే సందర్భాలలో పెద్దల పర్యవేక్షణ ఉండాలి.
- టపాసులు బహిరంగ ప్రదేశాలలోనే కాల్చాలి. కరెంటు తీగలు, గడ్డిమేట్లు, పూరి గుడెసెలు ఉన్న ప్రాంతాలలో టపాసులు కాల్చరాదు. మంటలు వ్యాపించడానికి ఆస్కారం లేని నిర్జన ప్రాంతంలో టపాసులు కాల్చాలి.
- పేలకుండా ఉండిపోయిన టపాసుల దగ్గరకు వెళ్లడం తాకడం చేయకూడదు. ముందు వాటిపై నీటిని పోసి ఆర్పాలి.
- శానిటైజర్ లాంటి మండే పదార్థాలు రాసుకుని టపాసులు కాల్చొద్దు.
- వాడిన టపాసులు ఇసుక బకెట్‌లో వేయాలి.
- టపాసులు కాల్చే సమయంలో ముందు జాగ్రత్తగా బక్కెట్‌తో నీటిని సిద్ధంగా ఉంచుకోవాలి.
- అత్యవసరమైతే ఫైర్ స్టేషన్‌కి కాల్ చేయడానికి నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలి.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం



సుధీర్ బాబు

సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం



సిద్ధు జొన్నలగడ్డ

"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథాను సారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.


ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకార ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

నేడు పాలకొల్లు ఏఎంసీ ప్రమాణ స్వీకారం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ఉదయం జరగనుంది. స్థానిక ఏఎంసీ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు కె.అచ్చెన్నాయుడు, డాక్టర్ నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లను మంత్రి నిమ్మల శుక్రవారం పరిశీలించారు. శనివారం ఉదయం మంత్రి నిమ్మల కార్యాలయం నుంచి భారీ ఊరేగింపుగా బయలుదేరి పూలపల్లి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం ఏఎంసీలో ప్రమాణ స్వీకారం అనంతరం భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, పీతల శ్రీను, పాముల రజనీ, ఎం.పెద్దిరాజు తదితరులు మంత్రితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఏఎంసీ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత కోడి విజయభాస్కర్, డైరెక్టర్లుగా దాసరి రత్నంరాజు, కలిదిండి రామచంద్రరాజు, బిట్ట లక్ష్మీనారాయణ, జడ్డు లక్ష్మీ తులసి అమ్మాజీ, సానబోయిన శ్రీనివాసరావు, రాయి శ్రీనివాస్, నీలం నారాయణ మూర్తి(తాతాజీ), కొప్పిశెట్టి జ్వాలా, గుబ్బల లక్ష్మి, వాసా భ్రమరాంబ, కొక్కిరమెట్ల అమ్మాజీ, గరికిపాటి రాజేశ్వరి, కారువల్లి వెంకటలక్ష్మీ కనకదుర్గ, పెన్మెత్స సత్యనారాయణరాజు, ఎస్.విజయకుమారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఆక్వా దోహదం


డైరెక్టర్ డా. ఐ.వి.నారాయణను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

తణుకు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగం రాష్ట్రంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారమని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం కామర్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్. ఉదయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం ఎస్కేఎస్‌ఐఎం డిగ్రీ కాలేజీలో రెండో రోజు ఆక్వా ఎంటర్ ప్రెన్యూర్ షిప్-వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయని తెలిపారు. పీలేరు ఎస్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆచార్యులు డా. ఎం.వెంకట రమణయ్య, విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆచార్యులు డా. ఓ.అచ్యుతరామకిషోర్, ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ ఎం.జగన్మోహన్, డా.ఎం.హరీష్, రావులపాలెం డిగ్రీ కాలేజి అధ్యాపకులు డా. బి.పి.నరసారెడ్డి, సదస్సు కో ఆర్డినేటర్ డా.ఐ.వి.నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలు ప్రసంగించారు.

మొగల్తూరు ఆస్పత్రి తనిఖీ


రోగులతో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి

మొగల్తూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏడాదికి విధిగా పది సుఖ ప్రసవాలు అయ్యేలా చూడాలని జిల్లా వైద్యాధికారిణి గీతా బాయి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే శీతాకాలంలో సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

న్యాయ సేవాధికార సంస్థ పథకాలపై అవగాహన ర్యాలీ

భీమవరం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన అసంఘటిత కార్మికుల పథకం, బాలల హక్కుల పరిరక్షణ పథకాలపై వివిధ శాఖల సమన్వయంతో ఈ నెల 18న ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించబోయే న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీస్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించుటకు శుక్రవారం చిన అమిరంలో 2కే ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి, సంస్థ చైర్మన్ డాక్టర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పథకాలపై అవగాహన కోసం శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్ని శాఖల స్టాల్స్ ఉంటాయని తెలిపారు. ర్యాలీలో న్యాయమూర్తులు ఎం.సుధారాణి, జి.సురేష్‌బాబు, పి.హనీష, ఎస్.జ్యోతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై.యోహాను (న్యూటన్), జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బీఎస్ఎన్ రెడ్డి, ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రనాథ్

నూతన కార్మిక విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

తాడేపల్లిగూడెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నూతన కార్మిక విధానాన్ని కార్మిక వర్గం పూర్తిగా వ్యతిరేకిస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ రెండు రోజుల సమావేశాలు శుక్రవారం తాడేపల్లిగూడెంలో ప్రారంభమయ్యాయి. భవన నిర్మాణ కార్మిక సంఘం వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని సీనియర్ నాయకుడు నెక్కంటి సుబ్బారావు ఎగురవేశారు. పూడి సుబ్బారావు ప్రాంగణంలో సమావేశాలు ప్రారంభమయ్యాయి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ నూతన కార్మిక విధానం కార్మికుహక్కులకు గొడ్డలి పెట్టని అభివర్ణించారు. కార్మికులు ఎంతో పోరాడి సాధించుకున్న 49 కార్మిక చట్టాలను కేంద్రం కాలరాస్తోందని ఆరోపించారు. నూతన కార్మిక విధానం వల్ల కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేలా ఉందన్నారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయడం దారుణమన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మిక లోకం గొంతుకోసే విధంగా ఉందన్నారు. ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకటరామరావు, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్, దూసనపూడి సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

నరసాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా విక్రయించే వ్యాపారులు కనీసం తాత్కాలిక లెసెన్స్ తీసుకున్న తరువాతే షాపులు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని ఆర్డీవో దాసిరాజు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పార్కు రోడ్‌లో తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ప్రతి షాపు వద్ద విధిగా ఇసుక, నీళ్ళ బకెట్లు ఉండాలన్నారు. దుకాణాల వద్ద నో స్మోకింగ్ బోర్డులు పెట్టాలన్నారు. విధిగా సీసీ కెమెరాలు ఉండాలన్నారు. రెవెన్యూ, ఫైర్, పోలీసులు తనిఖీలు చేయాలన్నారు. బాల కార్మికులతో అమ్మకాలు జరపరాదన్నారు. ఆయన వెంట కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ, సీఐ యాదగిరి, ఫైర్ అధికారి భాస్కర్ రామం, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు రుణ మంజూరు పత్రాలు పంపిణీ


రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్

భీమవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):పీఎం స్వ నిధిపై మెప్మా, లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం భీమవరం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లాలో అన్ని మునిసిపాలిటీల పరిధిలో అర్హులైన స్ట్రీట్ వెండర్స్‌కి రుణాలు మంజూరు చేసి పత్రాలను అందజేశారు. సుమారు 100 మంది వీధి వ్యాపారులు హాజరవ్వగా 70 మందికి రూ.18 లక్షలు రుణాల మంజూరు పత్రా లను అందజేశారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు నాగేంద్రప్రసాద్, యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ వెంకన్నబాబు, మెప్మా పీడీ హెప్సిబా పాల్గొన్నారు.


ఉండి మత్స్య పరిశోధన కేంద్రంలో రెండో రోజు శిక్షణ ఇస్తున్న వెంకట్రామన్నగూడెం శాస్త్రవేత్తలు దేవిప్రసాద్‌రెడ్డి, ప్రభంజనకుమార్‌రెడ్డి, మేతను పరిశీలిస్తున్న విద్యార్థులు

రొయ్యల సాగులో మేత కీలకం

శాస్త్రవేత్తల సూచనలు

ఉండి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రొయ్యల సాగులో మేత కీలకమని, వాటి ఉపయోగాలను ప్రతీ ఆక్వా రైతు, విద్యార్థులు అవగాహన చేసుకోవాలని శాస్త్రవేత్త ప్రభంజనకుమార్‌రెడ్డి అన్నారు. ఉండి మత్స్య పరిశోధన కేంద్రంలో ఎన్ఎఫ్‌డీబీ ఆర్థిక సహాయంతో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. రొయ్యల మేత తయారీ, యాజమాన్య పద్ధతులు క్లుప్తంగా వివరించారు. రొయ్యలసాగు చేయడం ఎంతో కష్టమని, క్రమ పద్ధతిలో సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలన్నారు.

ప్రయోగాత్మకంగా మేత తయారీ

రొయ్యల మేత పదార్థాలు, తయారీ విధానంపై శాస్త్రవేత్త దేవీప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు ప్రయోగాత్మకం గా వివరించారు. రొయ్యల మేత తయారీలో యాంటిబయోటిక్ ప్రత్యామ్నాయ అనుబంధ పదార్థాలను విద్యార్థులకు వివరించారు. మత్స్యపరిశోధన కేంద్రంలోని లేబోరేటరీని విద్యార్థులు పరిశీలించారు. కార్యక్రమంలో మత్స్య పరిశోధన కేంద్రం హెడ్ చంద్రశేఖర్‌రావు, శివకుమార్, భీమేశ్వరరావు, షష్టి రిష, ధీరజ్, నిశ్చల్, రాజగోపాల్ తదితరులతో పాటు భీమవరం కేజీఆర్ఎల్ కళాశాల లెక్చరర్స్ జాహ్నవి, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ఎంతో ఉపయోగం



మత్స్యపరిశోధన కేంద్రంలో శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగం. శాస్త్రవేత్తల సూచనలు అవగాహన కార్యక్రమాలను తెలుసుకుంటున్నాం. తరగతిలో బోధనతోపాటు క్షేత్రస్థాయిలో రొయ్యల సాగు, మేతల విధానం, పద్ధతులు వంటివి తెలుసుకుంటున్నాం. - రాజ్యలక్ష్మి, బీఎస్సీ ఫిషరీస్

రొయ్యల సాగు అర్థమైంది



రొయ్యల సాగు పద్ధతులు, విధానాలు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. మత్స్య పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు ఆక్వా విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం శాస్త్రవేత్తలు అందించిన సూచనలు సలహాలు ఎంతో విలువైనవి. - గణేశ్, బీఎస్సీ ఫిషరీస్

ఏఐ పరిజ్ఞానంతో కోళ్ల మరణాలకు చెక్

ప్రపంచ స్థాయి పోటీల్లో శృంగవృక్షం యువకుడి ప్రాజెక్టుకు తృతీయ స్థానం


ప్రపంచ వేదికపై మధులాష్‌బాబు విజయ దరహాసం

పాలకోడేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):శృంగవృక్షం గ్రామానికి చెందిన యువకుడు నూతన సాంకేతిక ఆవిష్కరణతో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందాడు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఆహార, వ్యవసాయ సంస్థ ఈ నెల 16న రోమ్‌లో ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో క్రొవ్విడి మధులాష్‌బాబు తృతీయ స్థానం సాధించి భారతదేశ పతాకం రెపరెపలాడించాడు. ఆహార విభాగం లో రైతులకు ఉపయోగపడే రీతిలో ఏఐ సాంకేతికతను ఉపయోగించి కోళ్ల మరణాలను అరికట్టే ప్రాజెక్ట్ రూపొందించాడు. జాతీయ స్థాయిలో ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి రోమ్‌లో జరిగే ప్రపంచస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అక్కడ ప్రపంచవ్యాప్తంగా 150 మందితో పోటీపడిన అతడి ప్రాజెక్ట్ ప్రపంచలో తృతీయ స్థానంలో నిలిచింది. ఎలక్ట్రానిక్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన మధులాష్‌బాబు హైదరాబాద్‌లో 'ఎడోధ్వజ' అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా తెలంగాణలో 40 వేల మంది విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, ప్రయోగాలను వినియోగించుకోవడంపై అవగాహన కల్పించాడు. తాజాగా నూతన ఏఐ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కోళ్ల మరణాలు అరికట్టే ప్రాజెక్ట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. మధులాష్ బాబు ప్రతిభతో మారుమూల గ్రామం శృంగవృక్షం ప్రపంచ పటంపై మెరిసిందని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పీఎంపీ, ఆర్ఎంపీల ఉమ్మడి జిల్లా సమావేశం

భీమడోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):పీఎంపీ, ఆర్ఎంపీల ఆత్మీయ సమావేశం శనివారం తాడేపల్లిగూడెంలో జరుగుతుందని, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని సభ్యులంతా విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా జేఏసీ కోకన్వీనర్ ఎం సాయి రామ్ శుక్రవారం తెలిపారు. 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, గ్రామీణ వైద్యుల పాత్ర' అంశంపై సమావేశం నిర్వహిస్తున్నామని, రాష్ట్ర కమిటీతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఇంకూలు నాగేశ్వరరావు కన్వెన్షన్ హాలులో సమావేశం జరుగుతుందన్నారు.

3 నుంచి మునిసిపల్ కార్మికుల సమ్మె

ఏలూరు టూటౌన్/ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):దీర్ఘకాలంగా మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భజంత్రి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మహాత్మా గాంధీ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యమం చేస్తున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోలేదని, వచ్చే నెల 3 నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు సమాయత్తమవుతున్నట్లు తెలిపారు. అప్పలరాజు, బండి వెంకటేశ్వర రావు, కిశోర్, కన్నబాబు, హేమశంకర్ పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో యువకుడికి ఏడేళ్ల జైలు

ఏలూరు క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్నేహితుని భార్యను బెదిరించి అత్యాచారం చేసినట్లు ఒక యువకునిపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ శుక్రవారం తీర్పు చెప్పారు. కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక దంపతుల ఇంటికి దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామానికి చెందిన మాండ్రు వెంకట ఆనంద్ (26) తరచుగా వస్తూ భర్తతో స్నేహం పెంచుకున్నాడు. భర్తలేని సమయంలో తరచుగా వచ్చేవాడు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2021 జూన్ 12వ తేదీన మాండ్రు వెంకట ఆనంద్ ఆ ఇంటికి రాగా ఆ వివాహిత, వారి పిల్లలు మాత్రమే ఇంట్లో ఉన్నారు. తన కోరిక తీర్చకపోతే పిల్లలను చంపేస్తానని, ఆమెను కూడా చంపివేస్తానని బెదిరించి, బలవంతంగా అత్యాచారం చేశాడు. అదే సమయంలో ఆ పిల్లల నానమ్మ వచ్చి అతడి జుట్టుపట్టుకుని కొట్టడంతో అక్కడ నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై కొయ్యలగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతమనేని రమేష్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు పోలవరం డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు, పోలవరం సీఐ బాలసురేష్‌బాబు, కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, హెచ్‌సీ కేఎస్ఎన్ మూర్తి, ఏఎస్ఐలు సిసిలి, రుక్మందనరావు, కోర్టు మహిళా కానిస్టేబుల్ హేమలత సకాలంలో సాక్ష్యులను కోర్టుకు హాజరుపరిచి ప్రాసిక్యూషన్‌కు సహకరించారు. ఈ కేసులో నిందితుడైన మాండ్రు వెంకట ఆనంద్‌పై నేరం రుజువు కావడంతో ఏడేళ్ళ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో మరో నెల రోజుల పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష విధించేలా ప్రాసిక్యూషన్‌కు సహకరించి తమ ప్రతిభను కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ కిశోర్ అభినందించారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి


ప్రభాకరరావు (ఫైల్)

భీమడోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన భీమడోలులో శుక్రవారం జరిగింది. భీమడోలు గ్రామంలో ఉంటున్న బసవ ప్రభాకరరావు(70) ఈనెల 15న ఇంటినుంచి వెళ్లి కనిపించలేదు. శుక్రవారం ఉదయం భీమడోలు శివాలయం పక్కనే ఉన్న చెరువులో మృతదేహం ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రభాకరరావుగా గుర్తించారు. రైల్వే స్టేషన్ మాస్టర్‌గా పనిచేసి రిటైర్ కావడంతో ఇంట్లోనే ఉంటున్నారు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మరిగే సాంబారులో పడి వ్యక్తి మృతి

కాకినాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ప్రమాదవశాత్తు మరిగే సాంబారులో పడి తీవ్ర గాయాలపాలైన ఓ వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాలివి.. భీమవరం అంబేడ్కర్ కాలనీకి చెందిన కటికల సునీల్‌కుమార్ (27) ఈ నెల 12న అదే ప్రాంతంలో ఓ వివాహ వేడుకకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు మరిగే సాంబారు దబరా గిన్నెలో పడిపోయాడు. తీవ్రగాయాలపాలైన అతడిని స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి, కాకినాడ జీజీహెచ్‌కు సిఫారసు చేశారు. అక్కడ నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతడికి భార్య నీలిమ, ఒక కుమారుడు ఉన్నారు. భీమవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.జయబాబు శుక్రవారం తెలిపారు. మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన జాలా వెంకటేశ్వరరావు ఈనెల 15న భార్య, పిల్లలతో కలిసి భద్రాద్రికొత్తగూడెం జిల్లా అచ్యుతాపురం గ్రామానికి వెళ్లి.. తిరిగి ఈ నెల 17న ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులకొట్టి ఉంది. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి గుర్తుతెలియని దొంగలు అరకాసు బంగారు చెవిపోగులు, జత వెండి పట్టీలు, రూ.5వేలు నగదు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళ బ్యాగ్‌లో బంగారం చోరీ

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న మహిళ బ్యాగ్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు వస్తువులను దొంగిలించారు. స్టేషన్ రైటర్ పి.బాబూరావు తెలిపిన వివరాలివి. ఇరగవరానికి చెందిన మంకు నాగలక్ష్మి తన కుటుంబంతో కలిసి శుక్రవారం పట్టణంలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ గ్రామానికి వెళ్లేందుకు జంగారెడ్డిగూడెం బస్టాండుకు వచ్చి తాడేపల్లిగూడెం బస్సు ఎక్కారు. ఆధార్ కార్డు కోసం బ్యాగ్ తెరచి చూడగా అందులోని 78 గ్రాముల బంగారు నెక్లెస్, నల్ల పూసలతాడు కనిపించలేదు. బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైటర్ తెలిపారు.


ఏలూరు, జీలుగుమిల్లిల్లో స్వాధీనం చేసుకున్న బాణసంచా సామగ్రి

బాణసంచా అక్రమ తయారీ కేంద్రంపై దాడి.. ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా జనవాసాల మధ్య అక్రమంగా బాణసంచా తయారీ చేస్తున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు వారి సిబ్బంది శుక్రవారం ఆ ఇంటిపై దాడి చేసి బాణసంచా సామగ్రిని సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఏలూరు సమీపంలోని సత్రంపాడులో కాసా గణేష్ వీరభద్రరావు, కాసా ప్రేమ సుందరరావు కలిసి భారీ ఎత్తున బాణసంచా సామగ్రి పౌడర్లను నిల్వలు పెట్టి, తారాజువ్వలు, ఉల్లిపాయలు, నార బాంబులు ఇతర సామగ్రి తయారు చేస్తున్నారు. త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు పి.రాంబాబు, పి.అప్పారావు వారి సిబ్బంది కలిసి ఆ ఇంటిపై దాడి చేసి 12 బస్తాల బానసంచా సామగ్రి సీజ్ చేసి, వారిద్దరిని అరెస్టు చేశారు.

దర్భగూడెంలో ఒకరు..

జీలుగుమిల్లి : దర్భగూడెంలో అక్రమ బాణసంచా నిల్వలపై ఎస్ఐ వి.క్రాంతికుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కంచర్ల సుబ్బారావు వద్ద బాణసంచా నిల్వలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. కానిస్టేబుల్ లక్షణ్ ఉన్నారు.


ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న గుత్తా వెంకటేశ్వరరావు

తమ్మిలేరు వాగుపై హైలెవెల్ కాజ్‌వే నిర్మించాలి

చింతలపూడి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శివపురం-చిన్నంపేట మధ్య తమ్మిలేరు వాగుపై హైలెవెల్ వంతెన నిర్మాణం మంజూరు చేయాలని కోరుతూ తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. వంతెన నిర్మాణంతో పలు మండలాల మధ్య దూరం తగ్గుతుందని, వెనుకబడిన గ్రామాల అభివృద్ధి, వరద సమయంలో రవాణా సౌకర్యానికి భరోసా ఉంటుందన్నారు. శివపురం నుంచి రాఘవాపురం తారు రోడ్డు సౌకర్యం, ఇళ్ల స్థలాల సమస్యలపై ఎమ్మెల్యే, ఎంపీ సిఫారసు పత్రాలను అందజేసినట్టు తెలిపారు.

పోలవరం నిర్వాసితులకు రూ.1100 కోట్లు విడుదల

ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్

ఏలూరు టూటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):పోలవరం నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లు విడుదల చేసిందని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే నిర్వాసితులకు నష్టపరిహారం అందుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఎన్నోసార్లు పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఫలితంగా కేంద్రం ఈ సొమ్ము విడుదల చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఇంకా నష్టపరిహారం అందని వారు బిల్లులను ప్రభుత్వానికి సమర్పించాలన్నారు.

పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్ సరళా వందనం బదిలీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలోని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు(పీఐపీ) భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ఎస్‌డీసీ సత్తెనపల్లి సరళావందనం బదిలీ అయ్యారు. ఆమెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీకి నేరుగా రిపోర్టు చేయాలని సీఎస్ కె.విజయానంద్ ఆదేశించారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు.


ఏలూరులో శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్

భద్రతా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఏలూరుక్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):విద్యార్థినులు చదువులో రాణించడానికి క్రమశిక్షణ ఎంత ముఖ్యమో.. భద్రత చట్టాలపై అవగాహన పెంచుకోవడం అంతే ముఖ్యమని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు సూచించారు. ఏలూరు ఎస్ఆర్ఐ కాలేజీ విద్యార్థినులకు శక్తి యాప్‌పై ఒక రోజు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థినులు ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే 112కు కాల్ చేయాలని పది నిమిషాల్లోపే పోలీసులు అక్కడకు చేరుకుంటారన్నారు. మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ శక్తి యాప్‌ను అభివృద్ధి చేసిందని ప్రతి ఒక్కరూ తమ ఆండ్రాయిడ్ మొబైల్‌లో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పోలీస్ సహాయం పొందవచ్చన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగమణి, కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందన

ఏలూరు క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లు నిడదవోలుకు చెందిన జి.వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెంకు చెందిన పి.విజయ్‌కుమార్‌లను ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. సీనియార్టీని బట్టి వీరికి పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎస్పీ కిశోర్ హామీ ఇచ్చారు. మూడో శుక్రవారం జిల్లా కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సంక్షేమ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి హామీ ఇచ్చారు.

వేర్వేరు చోట్ల పదకొండు మంది జూదరుల అరెస్ట్

పెదవేగి/పెదపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో వేర్వేరు చోట్ల మొత్తం పదకొండు మంది జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. పెదవేగిలో శుక్రవారం పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.34 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ సీహెచ్.రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలం అప్పనవీడు పంచాయతీ పరిధిలోని తాళ్ళమూడిలో పేకాడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశామని ఎస్ఐ కట్టా శారదాసతీష్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.36,950 నగదు, రెండు సెల్‌ఫోన్లు, నాలుగు మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 112కి లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రహదారిపై గుంతలో దిగబడిన ఆర్టీసీ బస్సు


దిగబడిన ఆర్టీసీ బస్సు

చాత్రాయి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చాత్రాయి వికాస్ స్కూల్ వద్ద ఉన్న భారీ గుంతలో శుక్రవారం ఆర్టీసీ బస్సు దిగబడింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బస్సు బయటకు రాకపోవడంతో ట్రాక్టర్‌తో బస్సును బయటకు లాగారు. పది రోజులుగా ఇక్కడ లోడు ట్రాక్టర్లు, ఆటోలు, చిన్న కార్లు దిగబడిపోతుండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మద్యం షాపుల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీ

చింతలపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి పట్టణంలోని మద్యం షాపులు, ఒక రెస్టారెంట్ అండ్ బార్‌ను ఎక్సైజ్ అధికారులు తనిఖీ జరిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిల్స్‌ను స్కాన్ చేసి అమ్మకం చేయాలన్నారు. మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. మార్కెట్ యార్డు సమీపంలో టి.రాంబాబు అనే వ్యక్తి నుంచి ఒక లీటరు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

'జీవన ఎరువుల వాడకంతో నాణ్యమైన దిగుబడులు'

పెదపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, జీవన ఎరువుల వాడకం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఏలూరు ఏరువాక శాస్త్రవేత్త డాక్టరు ఫణికుమార్ తెలిపారు. కొత్తూరు గ్రామంలో పొలం బడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రైతులకు క్షేత్రస్థాయిలో పంటసాగులో రైతులు అవలంబించాల్సిన విధానాలు, సలహా, సూచనలు అందజేశారు. వ్యవసాయాధికారి షేక్ ఇమామ్ ఖాసిం, ఎంపీటీసీ శ్రీనివాసరావు, కాశీవిశ్వనాధం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు కొండంత అండగా టీడీపీ : చంటి


సమస్యలు వింటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తలకు కొండంత అండగా ధైర్యాన్ని ఇవ్వడమే టీడీపీ కర్తవ్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన సమస్యలు స్వీకరించారు. 39వ డివిజన్‌కు చెందిన టీడీపీ కార్యకర్త ఎం.చిన్నయ్య మృతి చెందడంతో ఆమె కుటుంబసభ్యులకు ప్రమాద బీమా రూ.5లక్షలు బ్యాంకుఖాతాలో జమ చేశారు. ఆమె కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే చంటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. బెల్లంకొండ కిషోర్, పి.లవకిషోర్, ఇడా చైర్మన్ శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి భరోసా


రామారావుగూడెంలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి/ దెందులూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి భరోసా కల్పిస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో శుక్రవారం పలు గ్రామాలకు చెందిన ప్రజలు సమస్యల పరిష్కారం కోసం వినతులు అందించారు. అనారోగ్యంతో చికిత్స తీసుకున్న పినకడిమి గ్రామానికి చెందిన బూర్లగడ్డ రంగారావుకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.70వేలు, దెందులూరు మండలం రామారావుగూడెం గ్రామానికి చెందిన యర్రా దేవికి మంజూరైన రూ.41,235 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు మొతుకూరి నానిబాబు, బ్యాంక్ అధ్యక్షుడు డాక్టర్ పసుమర్తి మధు, పార్టీ అధ్యక్షుడు దాసరి రాజు, బాలిన కుమారి, పర్వతనేని సుబ్బారావు, కొత్తపల్లి రాంబాబు, పేరం యేసుదాసు, బ్రహ్మయ్య, బాలిన కామయ్య, కొత్తపల్లి సత్యనారాయణ, కొడుదల కేశవరావు, మణి తదితరులు ఉన్నారు.

పుంతలో ముసలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

చల్లచింతలపూడి శివారు కొత్తకమ్మవారిగూడెంలో శుక్రవారం పుంతలో ముసలమ్మ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేద పండి తులు దారాముక్కల మురళీగోపాలకృష్ణశర్మ, దారాముక్కల నాగ వెంకటభవానీ విశ్వనాథ అనిల్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో కమ్మ నరేంద్ర, రత్నమాణిక్యం దంపతులు ఏకదిన దీక్షతో పూజలు నిర్వహించారు.


తిరుమలలో నియోజకవర్గ నేతలతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

తిరుమల శ్రీవారి సేవలో ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, నియోజకవర్గ అభివృద్ధికి స్వామివారి ఆశీస్సులు కోరుకున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. తిరుమలలో వేంకటేశ్వరస్వామిని కూటమి నాయకులతో కలిసి శుక్రవారం ఆయన దర్శించుకుని ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. అనంతరం ఆయన ప్రజలకు మంచి చేసే మనస్సును, ఆరోగ్యాన్ని అందించాలని స్వామిని కోరుకున్నట్లు వివరించారు. కూటమి నేతలు పోలిన శ్రీనివాసరావు, లంకా సత్తిపండు, చింతమనేని హనుమంతరావు, పసుమర్తి సోమశేఖర్ పాల్గొన్నారు.

గంగానమ్మకు మాజీ ఎంపీ మురళీమోహన్ పూజలు


పూజలు చేస్తున్న మాజీ ఎంపీ మురళీమోహన్

ఏలూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు తూర్పువీధిలో గంగానమ్మ జాతర ఈనెల 31 నుంచి జనవరి 26వ తేదీ వరకు నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గంగానమ్మ మహాలక్ష్మమ్మ పోతురాజు ఆలయాన్ని సినీ నటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ విశిష్టతను, జాతర కార్యక్రమాల వివరాలను, వంకినేని భానుప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 31న ముడుపు కట్టుట, పందిరి రాటతో కార్యమం ప్రారంభమవుతుందని, జనవరి 25న కుంభం పోయుట, 26న మేళ తాళాలతో అమ్మవారిని సాగనంపుతామని వివరించారు.

'బాణసంచా విక్రయ కేంద్రాలు నివాసాలకు దూరంగా ఉంచాలి'

లింగపాలెం/పెదపాడు/జంగారెడ్డిగూడెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయ దుకాణాలను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలని, ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్నతో కలిసి మండ లంలోని లింగపాలెం, ధర్మాజీగూడెం, రంగాపు రం గ్రామాలలో బాణసంచా విక్రయ దుకాణాల ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పెదపాడు మండలంలో అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు ఉంచినా లేక అమ్మకాలు నిర్వహించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటా మని పెదపాడు ఎస్ఐ కట్టా శారదా సతీష్ తెలిపారు. పెదపాడు, అప్పనవీడు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. జంగారెడ్డి గూడెం పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో ఒక హోల్ సేల్, ఆరు రిటైల్ దీపావళి మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేశారు. గత ఏడాది నిర్వహించిన ప్రదేశంలోనే ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నామని, శనివారం నుంచి అమ్మకాలు చేస్తారన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు.. తొలి ప్రాధాన్యం

(7వ పేజీ తరువాయి)

ఇబ్బందులు పడుతున్నారు.

- కె.వెంకటేశ్వరరావు, కట్టా సుబ్బారావుతోట.

మేయర్ : ఇంజనీరింగ్ సిబ్బందిని పంపించి, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- శనివారపు పేట జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం నుంచి నిధులిస్తారా?

- పద్మజ, శనివారపు పేట

మేయర్ : సొంత స్థలం ఉంటే కార్పొరేషన్ పరిధిలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రుణం ఇస్తోంది. ఇటీవలే రూ.1.80 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు పెంచారు. ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

- శనివారపుపేట తివాచీ సెంటర్‌లో వర్షపునీరు రోడ్లపై నిలుస్తోంది. ఎప్పటికప్పుడు బయటకు పంపే మార్గం చూపించాలి.

- జి.పాల్, శ్రీరామ్‌నగర్

మేయర్ : పరిసరాలను పారిశుధ్య సిబ్బంది పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

- తంగెళ్లమూడి లక్ష్మీనగర్‌లో 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాం.15 ఏళ్ల నుంచి రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎవ్వరూ పట్టించుకోలేదు.

- కొరపాటి కిశోర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడికల్ కళాశాల

మేయర్ : రోడ్లు వేయడానికి నిధుల కొరతగా ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే రోడ్లు వేయిస్తాం.


టి.నరసాపురంలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు

టి.నరసాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని మండల ప్రజాపరిషత్ అధికారిణి మణికుమారి తెలిపారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్టీ సంస్కరణ వల్ల తగ్గిన ధరలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరుతుందని తెలిపారు. జీఎస్టీ తగ్గింపుతో వినియో గదారులకు రూ.5వేల నుంచి రూ.15 వేల వరకు లబ్ధి చేకూరుతుందని ఆయన తెలి పారు. కార్యక్రమంలో ఏపీవో నాగేశ్వరరావు, శేఖర్‌బాబు, రఘురాముడు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడి, దెందులూరు ఆసుపత్రుల వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల నిరసన

చింతలపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమ్మె ఐదో రోజుకు చేరింది. శుక్రవారం ఆసుపత్రి విధులను బహిష్కరించి నిరసనలో పాల్గొన్నారు. ఈమేరకు ఎక్కడి చెత్త అక్కడే ఉంది. నిరసన శిబిరం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మూడు రోజులుగా పెండింగ్ జీతాలు, పీఎఫ్ బకాయిల కోసం సిబ్బంది ధర్నా చేస్తున్నా జిల్లా అధికారులు స్పందించకపోవడం విచారకరమని అందువల్లే సమ్మెలోకి దిగామని తెలిపారు. సమ్మె కొనసాగిస్తున్న సమయంలో మునిసి పల్ కార్మికుల చేత ఆసుపత్రి శానిటేషన్ చేయించాలని డీసీహెచ్ ఎస్ ఇక్కడ సూపరింటెండెంట్‌కు ఆదేశాలు ఇవ్వడం సబబుకాదని, ఆ పనులను కూడా అడ్డుకుంటామని తెలిపారు. నిరసన ప్రదర్శనలో ఏఐటీయూసీ జిల్లా ఉపప్రధాన కార్యదర్శి టి.బాబు, టి.మరియమ్మ, రాము, కుమారి పాల్గొనగా సీపీఐ మండల కమిటీ సభ్యుడు కాలేషా మద్దతు తెలిపారు.

● దెందులూరు:దెందులూరు ప్రభుత్వ ఆసుప త్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు తమ వేతన బకాయిల కోసం ఆందోళన చేశారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి గేటు ముందు ఆసుపత్రి పారిశుధ్య సూపర్ వైజర్ బి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలోకి వైద్యులు, సిబ్బంది వెళ్లకుండా అడ్డుకుని ఆందోళన చేశారు. నాలుగు నెలల జీతాలు చెల్లించాలని, 15 నెలల పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ ద్వారా తెలి పిన్నప్పటికి ఎటువంటి చర్యలు తీసు కోలేదని కాంట్రాక్టర్ సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలు మధ్యాహ్నం వరకు నిలిచాయి

● జంగారెడ్డిగూడెం : స్థానిక ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో విధులు బహిష్కరించి శుక్రవారం ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. కార్మికులకు జీతాలు ఇవ్వకపోతే విధులకు హాజరయ్యే పరిస్థితి లేదని ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు జంపన వెంకటరమణ రాజు హెచ్చరించారు. పారిశుధ్య కార్మికులు వేముల రాజు, మేరీ, చంద్రకళ, దయామణి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలను చూపిస్తున్న రిటైర్డు ఆర్డీ దంపతులు రాజేంద్రప్రసాద్, వెజ్లీనా

'బుక్ నూక్'కు రిటైర్డు ఆర్డీ దంపతుల పుస్తకాల వితరణ

ఏలూరు, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇడా ఆధ్వర్యంలో అశోక్‌నగర్ పార్కులో ఏర్పాటు చేసిన బుక్ నూక్ సెంటర్(పుస్తకాల గూడు)లో ఉంచేందుకు పురపాలకశాఖ రిటైర్డు ఆర్డీ డాక్టర్ వి రాజేంద్రప్రసాద్, వెజ్లీనా దంపతులు రూ. 7 వేల విలువైన పుస్తకాలను శుక్రవారం వితరణ చేశారు. విలువైన చరిత్ర, చట్టం-కవిత్వం, ఆధ్యాత్మికం, కార్టూన్లు, ఆరోగ్యం, సైన్సు, జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్ మొదలైన 50 పుస్తకాలను అందులో ఉంచారు. విద్యార్థులు, పలు వర్గాల ప్రజలకు ఈ పుస్తకాలు ఉపయోగపడాలనే ఉద్దేశంతో తమ వంతుగా అందించామని తెలిపారు.

టీడీపీ నేత మల్లయ్య మృతి

బుట్టాయగూడెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం నీటి సంఘం అధ్యక్షుడు సోదెం మల్లయ్య గురువారం రాత్రి గుండెపోటుతో మరణించారు. చినజీడిపూడిలో ఉంటున్న ఆయనకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి ప్రాణాలను వదిలారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పలువురు నాయకులు తెలిపారు. కూటమి నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రేషన్ దుకాణానికి సీలు

చింతలపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రగడవరం పంచాయతీ పాతిమాపురం 39వ రేషన్ దుకాణంకు మండల పౌర సరఫరాల అధికారులు సీలు వేశారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రేషన్ సక్రమంగా ఇవ్వడంలేదని, దుకాణం తీయడం లేదని గ్రామస్థుల ఫిర్యాదుతో మూసివేశామని, త్వరలో కొత్త వారిని నియమిస్తామన్నారు.

23న సర్వసభ్య సమావేశం

పెదపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 23న మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన జరుగుతుందని పెదపాడు ఇన్‌చార్జి ఎంపీడీవో ఇందిరాగాంధీ తెలిపారు. మండలంలో పలు శాఖల పురోగతిపై సమీక్షతో పాటుగా అభివృద్ధి పనులు, నిధులపై శాఖల వారీగా సమీక్షిస్తామన్నారు.

ల్యాండ్ సీలింగ్ భూముల్లో పేదలకు పట్టాలివ్వాలి

జంగారెడ్డిగూడెం,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):పంగిడిగూడెంలోని సుమారు ఇరవై ఎకరాల ఎల్‌సీసీ సీలింగ్ మిగులు భూమిని సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వర రావు డిమాండ్ చేశారు. నవ్యాంధ్ర ప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ. ధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్నకూటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంగిడిగూడెంలో 232 ఎకరాల సీలింగ్ భూములను సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం భూమిలేని నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు. మడకం రామన్న, మందలపల్లి రాజు, కామన సత్యనారాయణ, మట్టపర్తి వెంకట్రావు, పి. రాఘవులు, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతోనే లబ్ధి

పెదవేగి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలను సాగుచేసే రైతులు ఈ పంట నమోదు చేసుకుంటే లబ్ధిపొందుతారని పెదవేగి మండల ఉద్యానశాఖా దికారి ఎం.రత్నమాల సూచించారు. శుక్రవారం పెదవేగిలో ఆమె రైతులతో మాట్లాడుతూ రైతులు సాగుచేసే పంటల వివరాలను ఈ పంటలో నమోదు చేసుకుంటే విపత్తుల సమయంలో నష్టపరిహారం పొందడానికి అర్హులవుతారని ఆమె చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ద్వారకాతిరుమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):పొలంలో మోటార్ ఫ్యూజ్ తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన ద్వారకా తిరుమల మండలం కోడిగూడెంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. దొరసానిపాడుకు చెందిన మానుకొండ విలియమ్స్(20) దెందులూరు ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్ రెండో సంవత్సరం చదువుతున్నారు. శుక్రవారం సెలవుపెట్టి కోడిగూడెంలో తమకు ఉన్న ఆయిల్‌పామ్ తోటకి తడి పెట్టేందుకు వెళ్లాడు, తోటకు నీరు పెట్టడం పూర్తి అయ్యాకు మోటార్‌ను ఆఫ్ చేయడానికి స్విచ్‌లు లేకపోవడంతో మోటారు ఫ్యూజు తీసే క్రమంలో విద్యుత్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు అక్కడకు చేరుకుని అతడిని దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.


సురక్షా యాప్‌పై వివరాలను ఆరా తీస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత

ఎక్సైజ్ సురక్షా యాప్ అమలు తీరుపై డిప్యూటీ కమిషనర్ ఆరా

ఏలూరు,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను మద్యం దుకాణాల్లో ఏ మేరకు అమలవుతుందనే విషయంపై ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత శుక్రవారం ఆరా తీశారు. నగరంలోని పడమరవీధి బీఎస్ఎన్ఎల్ సెంటర్‌లో అజయ్‌వైన్స్‌లో ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఏపీ సురక్షా యాప్ వినియోగదారులకు తమకు విక్రయించిన మద్యం సీసా ఉన్న బార్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆ బాటిల్ నాణ్యత ఒరిజనల్ లేదా నకిలీదో తెలుస్తుందన్నారు. బ్రాండ్‌పేరు, బ్యాచ్ నంబరు ఎంఆర్‌పీ, తయారీ ప్రదేశం వంటి పూర్తి సమాచారం సిబ్బందికి ఆమె అవగాహన కల్పించారు. మద్యం షాపుల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేశాకే మద్యం అమ్మకాలు జరపాలని ఆమె సూచించారు. ఏలూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య, స్టేషన్ హౌస్ ఎక్సైజ్ స్టేషన్ ధనరాజ్, పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీవో అనురాధ

ఆదాయం పెంపుపై దృష్టి సారించాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీలలో ఆదాయాలను పెంచే దిశగా కృషి చేయాలని డీపీవో కె.అనురాధ కోరారు. ఏలూరు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో మూడు రోజుల పాటు జరుగుతున్న పంచాయతీ సొంత ఆదాయ వనరులు అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం ముగిసింది. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామ పంచాయతీ సొంత ఆదాయ మార్గాలను విస్తరించుకోవాలని తద్వారా గ్రామాలను అభివృద్ధికి కృషి చేసుకోవాలన్నారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగిరాజు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల రికార్డుల నిర్వహణపై అత్యంత శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఉంగుటూరు ఎంపీడీవో జీఆర్ మనోజ్ మాట్లాడుతూ పంచాయతీలకు నూతన పద్ధతుల ద్వారా ఆదాయ మార్గాలను అన్వేషించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు పీవీ సత్యనారాయణ, ఎన్. తిరుపతిస్వామి, చేబ్రోలు, సూరప్పగూడెం సెక్రటరీలు జీడీ శ్రీనివాస్‌రావు, ముత్తయ్య ఫ్యాకల్టీలుగా వ్యవహరించారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

కామవరపుకోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తడికలపూడిలోని కంచి కామాక్షి ఆలయ ప్రాంగణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తడికలపూడి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఏలూరు గుడ్ సమరిటన్, శంకర్ నేత్రాలయ ఆసుపత్రి వర్గాలకు చెందిన వైద్య నిపుణులు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు ఇచ్చి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన కనసాని గోవిందమ్మ కుటుంబానికి ఐదు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని మానవత అధ్యక్షుడు పావులూరి చంద్రలాల్ గాంధీ, సర్పంచ్ గూడపాటి కేశవరావు అందించారు. మానవత కార్యవర్గ సభ్యులు నెక్కలపూడి సురేష్‌బాబు, కరుటూరి గంగాధరప్రసాద్, గూడపాటి శ్రీనివాస రావు, జాదం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రవ్వలకొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నడయాడిన కడప, కర్నూలు జిల్లాలోని రవ్వలకొండ వద్ద వంద అడుగుల వీర బ్రహ్మేంద్ర విగ్రహం నెలకొల్పి, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రధాని మోదీని ఏపీ విశ్వబ్రహ్మణ ధర్మపీఠం కోరిందని, ధర్మపీఠం ప్రధాన సం చాలకులు అప్పల భక్తుల శివకేశవరావు ఈ మేరకు ప్రధానికి లేఖ రాశారు. ఎందరో యోగులు, రుషులు నడయాడిన పవిత్ర భారతదేశం ప్రాధాన్యతను చాటిచెప్పే విధంగా యోగాను ప్రపంచ దేశాలు అనుసరించే విధంగా ప్రధాని మోదీ చేసిన కృషి దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేనిదన్నారు.

నదీ స్నానాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పోలవరం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ స్నానాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పవన్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో అయ్యప్పస్వామి, భవానీదీక్షలు వేసిన భక్తులు, గోదావరి రేవులను వినియోగిస్తున్నారన్నారు. హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో స్నానాలకు ఉపక్రమించవద్దని సూచించారు.


జేసీకి పూల మొక్కలు అందిస్తున్న ఉమ్మడి జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, నాయకులు

జిల్లా సమగ్రాభివృద్ధికి ఎన్జీవోలు కృషి చేయాలి

ఏలూరు/ఏలూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి ఎన్జీవోలు కృషి చేయాలని, ఉద్యోగులకు తానెప్పు డు సహాయ సహకారాలు అందిస్తానని జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ అన్నారు. ఉమ్మడి జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు వెంకట రామారావు జేసీని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి, సత్కరించారు. జిల్లా తాలూకా ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు జిల్లా జేసీగా బాధ్యతలు స్వీకరించిన అభిషేక్ గౌడ్‌ను శుక్రవారం ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరి యాల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు సాయల వెంకటేశ్వరరావు, ఏలూరు జిల్లా కోశాధికారి రవికుమార్, పెదవేగి మండల వీఆర్వో నాయకులు శ్రీనివాస్, ఝాన్సీ కలిసి అభినందించారు. జేసీకి వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రాజు రవీంద్రరాజు వివరించారు. జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-1, వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్‌లుగా ప్రమోషన్లు కల్పించాలని, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 ప్రమోషన్లు కల్పించి గ్రేడ్-2 వీఆర్వోల ప్రొహిబిషన్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జేసీ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

క్వాంటమ్ హబ్.. సైన్స్ రంగంలో నూతన అధ్యాయం : డీవైఈవో


ప్రథమ స్థానంలో నిలిచిన దివ్యశ్రీని అభినందిస్తున్న స్కూలు హెచ్ఎం కుటుంబరావు

ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమరావతిలో ఏర్పాటు చేసే క్వాంటమ్ హబ్ కార్యకలాపాలతో సైన్సు రంగంలో నూతనాధ్యాయం ప్రారంభ మవుతుం దని, విద్యార్థులకు అవగాహన, ప్రోత్సాహం కోసం అన్ని జిల్లాల్లో ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో సైన్సు సెమినార్లను నిర్వహిస్తున్నట్టు ఏలూరు డీవైఈవో రవీంద్రభారతి తెలిపారు. జిల్లాస్థాయి సైన్సు సెమినార్ శుక్రవారం స్థానిక సుబ్బమ్మ దేవి మున్సిపల్ హైస్కూలులో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీతో రూపొందించే ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేయలేరన్నారు. ఈ సందర్భంగా క్వాంటమ్ సాంకేతికతపై స్లైడ్‌లు, వివరణలు, ప్రశ్నావళితో విద్యార్థులకు పోటీ నిర్వహించారు. జిల్లాస్థాయి విజేతలుగా ఏలూరు సుబ్బమ్మదేవి హైస్కూలు విద్యార్థిని వై.దివ్యశ్రీ ప్రథమ, పెదపాడు మండలం అప్పనవీడు జ్యోతి హైస్కూలు విద్యార్థిని జి.సౌమ్య ద్వితీయ స్థానంలో నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ మణికుమార్, ప్రొఫెసర్ మాధవరావు వ్యవహరించారు. జిల్లాస్థాయి పోటీలో విజేతలుగా నిలిచిన ఇద్దరు విద్యార్థినులు ఈనెల 18న విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్సు సెమినార్‌కు పంపిస్తున్నట్టు జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు తెలిపారు. డివిజన్ పరిధిలోని 14 మండలాలనుంచి జిల్లాస్థాయి పోటీకి విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. స్కూలు హెచ్ఎం కుటుంబరావు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి.. రాజ్యాంగంపై దాడే


జంగారెడ్డిగూడెంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్పీఎస్ నాయకులు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు సీజేఐ బీఆర్.గవాయ్‌పై దాడి రాజ్యాంగంపై దాడేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు విస్సంపల్లి సిద్దు మాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలో నల్ల జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీజేఐ దాడి చేసి పది రోజులు కావస్తున్నా నేటికీ దాడి చేసిన వ్యక్తిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బొడ్డపాటి పండు, లాగు కిరణ్, తుట్టి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● **పెదవేగి** : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి న్యాయవ్యవస్థకే మాయని మచ్చ అని, దాడి కారకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు పెదవేగి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. పెదవేగిలో నిరసన ప్రదర్శన చేసి, తహసీల్దారు కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మురళీకృష్ణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయ్‌పై జరిగిన దాడి పాశవికమైందన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు యర్రా రఘు, తనగాల శేఖర్, మద్దాల తిరుపతిరావు, జొన్నకూటి జాన్, యర్రా ఆనంద్, మద్దాల మిఖాయేల్, కొలికిపాము ఏసు, అచ్యుత్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● **బుట్టాయగూడెం** : సీజేఐపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సీజేఐపై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ పిలుపులో భాగంగా శుక్రవారం మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్ నాయకులు దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీని చేపట్టి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం సీఎస్ఆర్ఐ కె.పద్మకు వినతిపత్రం అందజేశారు. నాయకులు చిడిపి గంగారావు, బొబ్బర ఎలీషా, నక్కా శివాజీ, చిడిపి కుటుంబరావు పాల్గొన్నారు.

● **చింతలపూడి** : సీజేఐ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ముత్తేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కొద్దిసేపు నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు తాళ్ళూరి రాజారావు, సి.హెచ్. విజయ, నక్షత్రం, గంధం శ్రీను, ఎం.సతీష్ పలువురు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కామినేని ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

కలిదిండి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం సానారుద్రవరంలో సంపద కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతూ 18న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంతోషపురం, భాస్కరరావుపేట, మూల్లంక గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు బుర్రకథ ప్రదర్శన

నూజివీడు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నూజివీడు అమర్‌భవన్‌లో శ్రీసాయి పూర్ణిమ బుర్రకథ బృందం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు బుర్రకథ ప్రదర్శన, చిన్నపిల్లలతో ఆనందోబ్రహ్మ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నూజివీడు కళావేదిక సభ్యుడు పి.కృష్ణప్రసాద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో కళాభిమానులు పాల్గొనాలని కోరారు.


దిగబడిన ఆర్టీసీ బస్సు (ఇన్‌సెట్) గుంతను పూడుస్తున్న దృశ్యం

రహదారిపై గుంతలో దిగబడిన ఆర్టీసీ బస్సు

చాట్రాయి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చాట్రాయి వికాస్ స్కూల్ వద్ద ఉన్న భారీ గుంతలో శుక్రవారం ఆర్టీసీ బస్సు దిగబడింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బస్సు బయటకు రాకపోవటంతో ట్రాక్టర్‌తో బస్సును బయటకు లాగారు. గత 10 రోజులుగా ఇక్కడ లోడు ట్రాక్టర్లు, ఆటోలు, చిన్న కార్లు దిగబడిపోతుండటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో సీసీ రహదారి నిర్మాణం కోసం మంత్రి పార్థసారథి చొరవతో 8 నెలల క్రితం రూ. 3 కోట్లు మంజూరు అయ్యాయి. కొత్త రోడ్డు నిర్మిస్తున్నారనే కారణంతో ఈ రోడ్డులో గుంతలు పూడ్చకుండా వదిలేశారు. దీంతో భారీ గుంతలు ఏర్పడి వాహనచోదకులు నరకం చూస్తున్నారు. వెంటనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్‌అండ్‌బీ అధికారులు బస్సు దిగబడిన భారీ గుంతలో మెటల్ పోసి పూడ్చారు.



యువత పాత్రే ప్రధానం : సబ్ కలెక్టర్

నూజివీడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భవి ష్యత్ సమాజ నిర్మాణంలో యువత పాత్ర ప్రధానమని నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న అన్నారు. శుక్రవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'ఫ్రమ్ నూజివీడు ఉయ్ లీడ్' అనే అంశంపై యువత, విద్యార్థులతో ఆమె సమావేశ మయ్యారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ-ప్లాట్‌ఫామ్ ద్వారా యువత ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువచేసే అవకాశం ఉంటుందన్నారు. సోషల్ మీడియా ద్వారా డాక్యుమెంటేషన్‌ల ద్వారా నూజివీడు అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, నూజివీడు సమగ్ర మ్యాప్ ఏర్పాటు తదితర అంశాలపై యువత నుంచి సలహాలు స్వీకరించారు. నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి, ఎంపీడీవో రాఘవేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హై లెవల్ వంతెన నిర్మించాలని సీఎంకు వినతి



చాట్రాయి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నంపేట, శివపురం గ్రామాల మధ్య తమ్మిలేరుపై హైలెవల్ వంతెన నిర్మించాలని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు ఇటీవల అమరావతిలో సీఎం చంద్రబాబును కలసి వినతి పత్రం అందజేశారు. భారీ వరదలకు అప్రోచ్ రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడ హై లెవల్ వంతెన నిర్మిస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని సీఎంకు వివరించగా సానుకూలంగా స్పందించినట్టు వెంకటేశ్వరరావు చెప్పారు.

ఉపాధ్యాయులకు సర్వీస్ బుక్స్ వితరణ

ముసునూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో డీఎస్సీ-2025 ద్వారా నూతనంగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులకు మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వీస్ బుక్స్‌ను అందజేశారు. 30 మంది ఉపాధ్యాయులకు యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు కాసాని గాంగేయుడు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మకిషోర్, గుడిమళ్ళ రాంబాబు ఎంఈవో-2 బీవీఎస్ సుబ్బారావుతో కలిసి సర్వీస్ బుక్స్‌ను అందజేసి అభినందించారు. సహాధ్యక్షుడు పుల్లయ్య, కోశాధికారి నారాయణ, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆగిరిపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాలీబాల్ జిల్లా స్థాయి పోటీలకు ఆగిరిపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు హైస్కూల్ హెచ్‌ఎం పి. పుష్పలత తెలిపారు. బాలుర విభాగంలో షేక్ షఫీ, బాలికల విభాగంలో పి. మహిమారాణి, జి. వైష్ణవి ఎంపికయ్యా రన్నారు. క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సుగుణరావు, శివ నాగేంద్రను గ్రామస్థులతో పాటు, హెచ్‌ఎం అభినందించారు.

ముసునూరు: రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు రమణక్కపేట జడ్పీపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం పి.రామకృష్ణారావు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీసి, వారికి శిక్షణ ఇచ్చి, ఉన్నతస్థాయికి తీసుకువెళుతున్న పీడీ నాగరాజును హెచ్‌ఎం అభినందించారు. శుక్రవారం పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు అభినందించారు.

ముదినేపల్లి: గురజ జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థిని ఆర్. భానుశ్రీ జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. గుడివాడ డివిజన్ స్థాయిలో బాలికల విభాగంలో శుక్రవారం జరిగిన పోటీల్లో ఈమె కృష్ణాజిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం సునీత తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

కైకలూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆచవరంలో బుర్ల రామస్వామి పూరిల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమవడంతో శుక్రవారం మానవత సేవా సంస్థ చైర్మన్ చిట్టెమ్మ, అధ్యక్షుడు గుర్రం శ్యాంకుమార్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు రూ.5 వేలు చెక్కును, కైకలూరుకు చెందిన గుర్రం సాగర్ స్టీలు పాత్రలు, దూలం వాసవి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో...

ముసునూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి మంత్రితో పాటు టీడీపీ నాయకులు ఆర్థిక సాయం చేశారు. మంత్రి పార్థసారథి ఆర్థిక సాయం రూ. 5 వేలతో పాటు స్థానిక టీడీపీ నాయకులు రూ. 10 వేలు కలిపి మొత్తం రూ. 15 వేలు బాధితుడు కలపాల పోతురాజు కుటుంబానికి టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, బలివే ఆలయ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, వేంపాడు మేజర్ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ తదితరులు శుక్రవారం అందజేశారు. ఇప్పటికే బాధిత కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారని, ప్రభుత్వ సాయం త్వరలో అందేలా చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270



నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

రహదారిని మూసేస్తున్నాయి..

◆ముళ్లచెట్లతో మూసుకుపోతున్న రహదారులు ◆ ప్రమాదాల బారిన వాహనచోదకులు

ముదినేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పలు రహదారులు ముళ్లపొదలు, చెట్లతో మూసుకుపోయి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి. ఆదాయం ఉన్న పంచాయతీలు కూడా ఆయా గ్రామాల్లోని అంతర్గత రహదారులను ప్రజలు నడిచి వెళ్లేందుకు కూడా అనువుగా అభివృద్ధి చేయలేకపోతున్నాయి. అల్పాదాయం ఉన్న పంచాయతీల్లోని అంతర్గత రహదారుల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ నిధులు మంజూరు చేయటం లేదు. ముదినేపల్లి మండలంలోని ఎన్నో గ్రామాలకు వెళ్లే అప్రోచ్ రోడ్లు గ్రామాల్లోని అంతర్గత రహదారులు, పలు గ్రామాల్లో శ్మశాన వాటికలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్ల తరబడి ఇలాగే ఉన్నా పాలకులు గానీ, పంచాయతీ అధికారులు గానీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఆదాయం ఉండి సుమారు రూ.37 లక్షల పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగిందని డీపీవో నిర్ధారణ చేసిన మండలంలోని పెయ్యేరు పంచాయతీలో అంతర్గత రహదారుల వెంబడి ముళ్లపొదలను తొలగించే పనులను పంచాయతీ నిర్వహించలేకపోయింది. ఆదాయం లేని ఈడేపల్లి గ్రామ అప్రోచ్ రోడ్డు అభివృద్ధి, ముళ్ల చెట్ల తొలగింపు పనులకు పంచాయతీరాజ్ శాఖ నిధులు మంజూరు చేయటం లేదు. ముదినేపల్లి, అన్నవరం, కోమర్రు, పేరూరు, వైవాక గ్రామాల అప్రోచ్ రోడ్లు కూడా చెట్లతో మూసుకుపోయి ఇరుకుగా తయారై ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవటం శోచనీయం.

మీడియేటర్లుగా పనిచేసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): న్యాయ సేవాధికార సంస్థ కమిటీల్లో మీడియేటర్లగా పని చేసేందుకు అర్హులైన వారు ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కృష్ణాజిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేబీ రామకృష్ణ తెలిపారు. జిల్లాలోని అన్ని న్యాయసేవాధికార సంస్థల్లో మీడియేటర్లగా పని చేసేందుకు సీనియర్ న్యాయవాదులు, సోషల్ వర్కర్లు, న్యాయనిపుణులు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు మచిలీపట్నం చైర్మన్ లేదా మండల న్యాయ సేవాధికార కమిటీలకు అందజేయాలన్నారు.

ఆలయ భూమి సర్వే

నూజివీడు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నూజివీడు వేంకటాచల స్వామి దేవస్థానం భూముల సర్వేను శుక్రవారం నిర్వహించారు. దేవదాయ, ధర్మదాయశాఖ నూజివీడు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈవో అలివేణిశ్రీ నేతృత్వంలో సుంకొల్లులో సర్వే జరిగింది.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

ఆగిరిపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ కుమారి, ఈఈ ఎ. సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం ఆగిరిపల్లి సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు 44 బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ చౌర్యం, అదనపు లోడ్ వినియోగంపై రూ.5,24,000 అపరాధ రుసుం విధించారు. అసిస్టెంట్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, జూనియర్ ఇంజనీర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు

కైకలూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళికి మందుగుండు సామగ్రి విక్రయాలకు కైకలూరు మార్కెట్ యార్డులో దుకాణాలను ఏర్పాటుచేస్తున్నారు. 11 దుకాణాలకు పోలీసులు అనుమతులు మంజూరు చేశారు. ప్రతి దుకాణం వద్ద డ్రమ్ములతో నీటిని ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాల చుట్టుపక్కల ఎవరూ టపాసులు కాల్చవద్దని కైకలూరు టౌన్ ఎస్సై ఆర్. శ్రీను హెచ్చరించారు.

కలిదిండి: మండలంలో 10 బాణాసంచా షాపులకు లైసెన్సు మంజూరయిందని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. కలిదిండిలో 5, కోరుకొల్లు 4, మూల్లంక 1 బాణాసంచా షాపుల ఏర్పాటుకు లైసెన్సు ఇవ్వటం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయించినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముదినేపల్లి: అనధికారికంగా మందుగుండు సామగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముదినేపల్లి తహసీల్దార్ లతీఫ్ పాషా తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముదినేపల్లిలో 6, సింగరాయపాలెంలో 5 షాపులకు లైసెన్సులు ఇచ్చామని, లైసెన్సులు పొందిన వారు తమ దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు.


త్రీఫేజ్ కరెంట్ సరఫరా ప్రారంభిస్తున్న దృశ్యం

తాగునీటి సమస్యకు చెక్

నూజివీడు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం పల్లెర్లమూడి శివారు రాట్నాల గూడెం గ్రామస్థుల తాగునీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. డైరెక్ట్ పంపింగ్ వర్క్స్‌కు సంబంధించి త్రీఫేజ్ కరెంట్ ఇస్తే సమస్యను అధిగ మించవచ్చని, గ్రామస్థులు మంత్రి పార్థసారథి దృష్టికి తేగా ఆయన సమస్య పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో సుమారు రూ. 35 లక్షలతో త్రీఫేజ్ కరెంట్‌ను అందించేందుకు చర్యలు చేపట్టడంతో రాట్నాలగూడెం వాసుల తాగునీటి కష్టాలు తీరాయి. దీంతో గ్రామస్థులు దావులూరి కృష్ణమోహన్, బెజవాడ శ్రీనివాసరావు, యనమదల సిద్దయ్య తదితరులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రజల నుంచి ప్రభుత్వం నేరుగా ఆరా

జడ్పీ సీఈవో శ్రీహరి


సంపద కేంద్రం పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

కైకలూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించి పారిశుధ్య సమస్య పరిష్కారానికి కృషి చేయాలని జడ్పీ సీఈవో ఎం. శ్రీహరి అన్నారు. శుక్రవారం అటపాకలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్య పనులపై ఐవీఆర్‌ఎస్ కాల్ ద్వారా సమాచారం సేకరిస్తోందని, ప్రతి నెల 1 నుంచి 10వ తేదీ వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో ఐవీఆర్‌ఎస్ కాల్స్ వస్తాయన్నారు. గ్రామాల్లో ప్రజల నుంచి ఫోన్‌లో ప్రభుత్వం సమాచారం సేకరిస్తుంది. ఇటీవల అటపాక గ్రామంలో ఐవీఆర్‌ఎస్ కాల్ ద్వారా పారిశుధ్యంపై వివరణ కోరగా 65 శాతం ప్రజలు అధ్వానంగా ఉందని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రతి గ్రామంలో రోజు విడిచి రోజు ఇంటింటా చెత్త సేకరణ జరగాలన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోతే పంచాయతీ కార్యదర్శుల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో ఆర్. రాజ బాబు, డిప్యూటీ ఎంపీడీవో జి.అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ పాల్గొన్నారు.



చాట్రాయి, నూజివీడు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అది రాజ్యాంగంపై దాడి

న్యాయమూర్తిపై దాడికి యత్నంపై ఎమ్మార్పీఎస్ నిరసనలు

చాట్రాయి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీజే గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ చాట్రాయి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవిరామ్ మాట్లాడుతూ దళితుడైన సీజేపై దాడికి యత్నించటం హేయమని, ఇది రాజ్యాంగంపై దాడి చేసినట్లేనని అన్నారు. మళ్ళీ ఇటువంటి చర్యలు పునరావృత్తం కాకుండా దోషిని కఠినంగా శిక్షించాలని డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కోట జోషి, దుర్గం పుల్లారావు, గద్దల నాగేశ్వరరావు, చౌటపల్లి రాంబాబు, దుర్గం వెంకటేశ్వరరావు, కొమ్ము ప్రసాద్, జయరాజు, లాజరు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నూజివీడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నిరసన తెలిపిన వారిలో నూజివీడు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎం. రమేష్, నూజివీడు ఇన్‌చార్జి టి.రుద్రయ్య, వెంపటి వెంకటేశ్వరరావు, కలపాల విలియం, కుంపటి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

25 లోగా రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

చాట్రాయి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు ఈ నెల 25వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో శివశంకర్ కోరారు. చాట్రాయిలో శుక్రవారం ఈ-క్రాప్ నమోదును ఏవో పరిశీలించి మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 11,360 ఎకరాలు ఈ-క్రాప్ నమోదు చేశామని, మిగిలిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రంలో సంప్రదించి నమోదు చేయించుకుని ప్రభుత్వ సదుపాయాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సన్న ధాన్యం రైతులు సాగు చేసినట్లు ఏవో తెలిపారు.

దాళ్వాకు అనుమతి ఇవ్వాలి

పోల్‌రాజ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ

ముదినేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, తూర్పు డెల్టాలో దాళ్వా సాగుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని శుక్రవారం ముదినేపల్లిలో జరిగిన పోల్‌రాజ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ సమావేశం కోరింది. కమిటీ అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు (కొండ) అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. వాతావరణం అనుకూలంగా ఉన్నందున రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం దాళ్వా వరి సాగుకు అనుమతి ఇవ్వాలని, రైతులు కూడా దాళ్వా సాగును కోరుకుంటున్నారని డీసీ వైస్ చైర్మన్ హనుమార పేర్నీడు తెలిపారు. డీసీ పరిధిలోని నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ పంట కాల్వలు, మురుగుకాల్వలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సమావేశం తీర్మానించింది. కాలువల్లోని గుర్రపుడెక్క, తూడు నిర్మూలనకు నిధులు మంజూరు చేయాలని పలువురు నీటి సంఘాల అధ్యక్షులు కోరారు. సమావేశంలో ఇరిగేషన్ డీఈఈ శిరిష, డ్రైనేజీ డీఈఈ మరడాని రామకృష్ణ, ఏఈలు కుమార్, భోగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాన్ బెన్నీ

మతబోధకుల గౌరవ వేతన బకాయిలు చెల్లించాలి

ముదినేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం క్రైస్తవ మతబోధకులకు 13 నెలల గౌరవ వేతన బకాయిలను చెల్లించాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్. జాన్‌బెన్నీ కోరారు. ముదినేపల్లిలోని క్రిస్టియన్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చర్చిల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, పాస్టర్ల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపడతామన్నారు. సంఘ ఏపీ, తెలంగాణా కో ఆర్డినేటర్ సతీష్‌కుమార్, కార్యదర్శి ముత్యాల జయరాజు, పాస్టర్లు పాల్గొన్నారు.

పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్

సరళా వందనం బదిలీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 17(ఆంధ్ర జ్యోతి): ధవళేశ్వరంలోని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు(పీఐపీ) భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ఎస్‌జీడీసీ సత్తెనపల్లి సరళావందనం బదిలీ అయ్యారు. ఆమెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీకి నేరుగా రిపోర్టు చేయాలని సీఎస్ కె.విజయానంద్ ఆదేశించారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు.

ఉద్యోగాలిప్పిస్తామని మోసాలు : ఎస్‌ఐ

కైకలూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వెబ్‌సైట్‌లో ఉద్యోగాల పేరిట సైబర్ నేరగాళ్ల మోసాలను గుర్తించి జాగ్రత్తలు పాటించాలని కైకలూరు టౌన్ ఎస్సై ఆర్. శ్రీను అన్నారు. శుక్రవారం కైకలూరు కార్నర్‌స్టోన్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆన్‌లైన్లో డిస్కౌంట్ ధరలకు అమ్మే వస్తువుల పట్ల ఆశపడి మోసపోవద్దన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ, బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

జల్లులతో రైతుల్లో ఆందోళన

కలిదిండి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వాతావరణ మార్పులతో అక్కడక్కడ చిరుజల్లులు పడుతుండటంతో వరి పంట చేతికి వస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాల పురం, వెంకటాపురం గ్రామాల్లో ధాన్యం గింజలు పసుపు రంగులోకి మారటానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే వాతావరణ మార్పులతో రైతులు దిగాలుగా ఉన్నారు.



మద్యం దుకాణాల తనిఖీ

నూజివీడు టౌన్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎక్సైజ్ పరిధిలో గల మద్యం దుకాణాలను ఎక్సైజ్ ఎస్సైలు ఎం.ప్రసాద్, ఇ. గణపతి శుక్రవారం తనిఖీ చేశారు. నకిలీ మద్యం సరఫరా జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య నేతృత్వంలో ఎక్సైజ్ సిబ్బంది మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కల్పించారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జపమాల మాత ఉత్సవాలు ప్రారంభం

చాట్రాయి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చాట్రాయి ఆర్సీఎం చర్చిలో పరిశుద్ధ జపమాలమాత మహోత్సవాలు రెవరెండ్ ఫాదర్ పోలిశెట్టి జయరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవాలు 3 రోజుల పాటు జరుగుతాయని, 19న చాట్రాయి పుర వీధులలో మాత ఊరేగింపు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు..

తొలి ప్రాధాన్యం

(7వ పేజీ తరువాయి)

ఇబ్బందులు పడుతున్నారు.
- కె.వెంకటేశ్వరరావు, కట్టా సుబ్బారావుతోట.

మేయర్: ఇంజనీరింగ్ సిబ్బందిని పంపించి, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- శనివారపు పేట జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం నుంచి నిధులిస్తారా?
  - పద్మజ, శనివారపు పేట

మేయర్: సొంత స్థలం ఉంటే కార్పొరేషన్ పరిధిలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రుణం ఇస్తోంది. ఇటీవలే రూ.1.80 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు పెంచారు. ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

- శనివారపుపేట తివాచీ సెంటర్‌లో వర్షపునీరు రోడ్లపై నిలుస్తోంది. ఎప్పటికప్పుడు బయటకు పంపే మార్గం చూపించాలి.
  - జి.పాల్, శ్రీరామ్‌నగర్

మేయర్: పరిసరాలను పారిశుధ్య సిబ్బంది పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

- తంగెళ్లమూడి లక్ష్మీనగర్‌లో 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాం.15 ఏళ్ల నుంచి రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎవ్వరూ పట్టించుకోలేదు.
  - కొరపాటి కిశోర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడికల్ కళాశాల

మేయర్: రోడ్లు వేయడానికి నిధుల కొరతగా ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే రోడ్లు వేయిస్తాం.



చేపల చెర్వుల నీటి ముంపు నివారిస్తాం : తహసీల్దార్

ముదినేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చేపలు, రొయ్యల చెరువుల నుంచి వస్తున్న వృథా నీటి వల్ల చేవూరు గ్రామంలోని దళితవాడతో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పడుతున్న ముంపు నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లతీఫ్ పాషా హామీ ఇచ్చారు. శుక్రవారం గ్రామంలో ఆయన చేపల చెరువుల వెంబడి గతంలో తవ్విన ఊట బోదెలను పరిశీలించారు. చెరువుల నుంచి వచ్చే వృథా నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఇళ్ళ ఆవరణలోకి ప్రవేశిస్తున్నదని దీని వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు తహసీల్దార్‌కు విన్నవించారు. అనంతరం చెరువుల వెంబడి పూడ్చివేసిన ఊట బోదెలను పరిశీలించి చెరువుల వివరాలను సేకరించాలని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సతీష్‌ను ఆదేశించారు. అనుమతులు లేకుండా తవ్విన చేపల చెరువుల జాబితాలను తనకు అందజేయాలని కూడా ఆయన ఆదేశించారు.

బైక్ దొంగకు ఏడాది జైలు

ఆగిరిపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగిలించిన వ్యక్తికి న్యాయమూర్తి ఏడాది జైలు శిక్ష విధించినట్టు ఎస్‌ఐ కె. శుభశేఖర్ తెలిపారు. 2024లో సగ్గూరుకు చెందిన తొండూరు శ్రీమన్నారాయణ తన బైక్ చోరీ అయినట్టు ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని రాజమండ్రి వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో ఎన్టీఆర్ జిల్లా, మల్లవరం గ్రామానికి చెందిన చుండూరు రమేష్‌కు నూజివీడు రెండో అదనపు న్యాయమూర్తి కె. శ్రావణి ఏడాది జైలు శిక్ష విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మరిగే సాంబారులో పడి ఒకరి మృతి

కాకినాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ప్రమాదవశాత్తు మరిగే సాంబారులో పడి తీవ్ర గాయాలపాలైన ఓ వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భీమవరం అంబేడ్కర్ కాలనీకి చెందిన కటికల సునీల్‌కుమార్ (27) ఈ నెల 12న అదే ప్రాంతంలో ఓ వివాహ వేడుకకు వెళ్లి ప్రమాదవశాత్తు మరిగే సాంబారు గిన్నెలో పడిపోయాడు. తీవ్రగాయాలపాలైన అతనిని స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు సిఫారసు చేశారు. 4 రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భీమవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

భీమడోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన భీమడోలులో శుక్రవారం జరిగింది. భీమడోలు గ్రామంలో ఉంటున్న బసవ ప్రభాకరరావు(70) ఈనెల 15న ఇంటినుంచి వెళ్లి కనిపించలేదు. శుక్రవారం ఉదయం భీమడోలు శివాలయం పక్కనే ఉన్న చెరువులో మృతదేహం ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడం తో ప్రభాకరరావుగా గుర్తించారు. రైల్వే స్టేషన్ మాస్టర్‌గా పనిచేసి రిటైర్ కావడంతో ఇంట్లోనే ఉంటున్నారు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాణసంచా అక్రమ తయారీ కేంద్రంపై దాడి

ఏలూరు క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్నట్టు ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది శుక్రవారం ఆ ఇంటిపై దాడి చేసి బాణసంచా సామగ్రిని సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఏలూరు సమీపంలోని సత్రంపాడులో కాసా గణేష్ వీరభద్రరావు, కాసా ప్రేమ సుందరరావు కలిసి భారీ ఎత్తున బాణసంచా సామగ్రి నిల్వలుంచి బాణసంచా తయారు చేస్తున్నారు. త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది దాడి చేసి 12 బస్తాల బాణసంచా సామగ్రి సీజ్ చేసి, వారిని అరెస్టు చేశారు.

జీలుగుమిల్లి: దర్భగూడెంలో అక్రమ బాణసంచా నిల్వలపై ఎస్‌ఐ విక్రాంతికుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కంచర్ల సుబ్బారావు వద్ద బాణసంచా నిల్వలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. కానిస్టేబుల్ లక్ష్మణ్ ఉన్నారు.

దాడులపై పరస్పరం ఫిర్యాదులు

ముదినేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకోమర్రులో ఈ నెల 11న రెండు కుటుంబాలకు వారు పరస్పరం దాడులకు పాల్పడిన ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామంలో ఎస్సీ వర్గానికి చెందిన తాను తన భార్యను కేకలు వేస్తుండగా, అదే గ్రామానికి చెందిన శీలం సురేంద్రబాబు, అతని తల్లిదండ్రులు నాగబాబు, మంగతాయారు, బంధువులు శిరీష, శివరామకృష్ణ తనను కులం పేరుతో దూషించి, అడ్డు వచ్చిన కుమారుడు విజయ్‌పై దాడి చేశారని పట్టేటి సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఏఎస్‌ఐ పద్మజ దర్యాప్తు చేస్తున్నారు. కాగా పట్టేటి సురేష్, అతని కుమారుడు విజయ్ తాను తన కుమార్తెతో కలసి ఇంటికి వెళ్తుండగా, తమను దుర్భాషలాడి దాడి చేశారని శీలం మంగతాయారు ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఎ.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాత కక్షల వల్లే పరస్పరం దాడులకు పాల్పడ్డారని సమాచారం.